# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల

## సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

(ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

సోమవారము 9-00 to 9-15 p. m.
బుధవారము 9-30 to 9-45 a. m.

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము, శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మలయాళం — THE VOICE OF TRUTH**

మంగళవారము, శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు
కరస్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను
ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI**
P.O. Box: 80
KAKINADA - 533 001

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్య వాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక 3 | అక్టోబరు 1984 | సంపుటి 5

## సంపాదకీయము

### స్థిరమైన పునాది

### *( The Sure Foundation )*

యేసు సంఘమును కట్టుదునని చెప్పినప్పుడు దాని నొక బండపై కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). అయితే అసలు ప్రశ్న యేమంటే ఆ బండ యేమిటి? లేక యెవరు? దీనికి జవాబు నిచ్చుటకు మనము దాని సందర్భమును గమనించవలెను. మొదటిగా, నేనెవరినని మనుష్యులు తలంచుచున్నారు? అని ప్రభువు తన శిష్యుల నడిగెను. ప్రజలాయనను ఒక ప్రవక్తగా భావించుచున్నారని వారు ఆయనకు వివరించిరి. "అందు కాయన మీరైతే నేను ఎవడనని చెప్పుకొను చున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు, నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను". ప్రభువు కోరునట్టి జవాబు అదే గనుక "యేసు సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు; పరలోకమందున్న నా తండ్రి ఈసంగతి నీకు బయలు

పరచనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాననెను". అయితే పేతురు ఏమి ఒప్పుకొనెను? యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనెను. అంతకు తక్కువ ఏమి కాదు. అప్పుడు ప్రభువేమి చెప్పెను! ఆయన, ఈ బండమీద అనగా నేను దేవుని కుమారుడనని నీవు చేసిన ఒప్పుకోలు మీద, నా సంఘమును కట్టుదును అని చెప్పెను. ఇంకొక మాటలో క్రీస్తు ఒక సంఘమును నిర్మించబోవుచున్నాడు; దానిని స్థిరముగా యుండు పునాదిపై ఆయన నిర్మించబోవు చున్నాడు. అది అట్లయిన దానిని ఆయన ఒకరిద్దరి ప్రవక్తలపై నిర్మించబోవుట లేదు. సరిగదా దానిని పేతురుపై గాని లేదా అపొస్తలులపై గాని నిర్మించబోవుట లేదు. ప్రశ్నేమంటే ఆయన దేవుని కుమారుడా? కాదా! యనునది. ఆయనే దేవుని కుమారుడనే జవాబు కూడ దొరికినది గనుక ఈ గొప్ప సత్యముపై ఆయన తన సంఘమును నిర్మింతునని ప్రకటించెను. ఈ గొప్ప వాస్తవముపై నేటికికంకను సంఘము ఆధారపడి యున్నది. క్రీస్తు దేవుని కుమారుడు కాదని నిరూపింపబడ గలిగిన యెడల సంఘము కూలిపోయి ఛిన్నాభిన్న మగును.

క్రీస్తే ఆ బండయని, స్థిరమైన పునాది యని చెప్పబడెను. 1 కొరింథి 10:4 లో మోషేతో కూడ సముద్రముగుండా నడిచిన వారిని గూర్చి పౌలు చెబుతు "వారందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి; అందరు ఆత్మసంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మ సంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే" యని పలికెను. మరల 1 కొరింథి 3:9-11 లో అతడిట్లు వ్రాసెను: "మేము దేవుని జత పనివారమై యున్నాము; మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునై యున్నారు. దేవుడు నాకనుగ్రహించిన కృప చొప్పున నేను నేర్పరి

యైన శిల్పకారునివలె పునాది వేసితిని. మరియొకడు దానిమీద కట్టుచున్నాడు; ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగ చూచుకొనవలెను. వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయ నేరడు; ఈ పునాది యేసుక్రీస్తే". ఇవిగాక వేరే వచనములు ఒకవేళ లేకపోయినను, వీటినిబట్టి క్రీస్తే ఆబండయని, పునాది యని గుర్తించ బడుటను మనము గమనించగలము. కాని ఆయన దేనికి బండ మరియు పునాదియై యున్నాడు ? సంఘమునకే గదా.

సంఘము దేవుని గృహమని చెప్పబడినది. తిమోతికి వ్రాయుచు పౌలు ఇట్లు హెచ్చరించెను : "అయినను నేను ఆలస్యము చేసినయెడల దేవుని మందిరములో, అనగా జీవము గల దేవుని సంఘములో జను లేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను" (1 తిమోతి 3:15). కొరింథులోని సంఘ మును గూర్చి చెబుతు దానిని దేవుని గృహముగా అతడు వర్ణించెను (1 కొరింధి 3:9).

భౌతిక భవనపు పునాదిలో అతి ప్రాముఖ్యమైనది మూలరాయి. దేవుని గృహమగు సంఘమునకు కూడ అట్లే. ఈ సందర్భములో క్రీస్తే ఆ మూలరాయి. ఆయనను గూర్చి యెషయా ప్రవక్త ఇట్లనెను : "ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు – సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి. అమూల్యమైన తలరాయి. బహు స్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది, విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28 : 16). "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి, మూలకు తలరాయి ఆయెను" అని దావీదు పలికెను (కీర్తన 118:22). ఇదే సంగతి లూకా 20:17, మార్కు 12:10, మత్తయి 21:42 లో మరల చెప్పబడెను. పేతురు యూదుల అధికారులకు క్రీస్తును గూర్చి ప్రకటించుచు అపొ. కా. 4:11 లో ఇదే వచనమును ఎత్తి చూపించెను. ఎఫెసులో యున్న

సంఘమునకు వ్రాయుచు పౌలు దీనిని ఇట్లు బలపరచెను : "కాబట్టి మీరిక మీదట పరజనులును, పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును, దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయము అగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరుకూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19-22). చివరిగా పేతురిట్లు వ్రాయుచున్నాడు : "యేసు క్రీస్తుద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు ఏలయనగా ఇదిగో నేను ముఖ్యమును, ఏర్పరచబడినదియు, అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించుచున్నాను; ఆయన యందు విశ్వాసముంచువాడు ఏమాత్రమును సిగ్గుపడడు అను మాట లేఖనమందు వ్రాయబడి యున్నది. విశ్వసించుచున్న మీకు, ఆయన అమూల్యమైన వాడు; విశ్వసింపని వారికైతే, ఇల్లు కట్టువారు ఏ రాతిని నిషేధించిరో అదేమూలకు తలరాయి ఆయెను. మరియు అది అడ్డురాయియు అడ్డుబండయు ఆయెను. కట్టువారు వాక్యమునకవిధేయులై తొట్రిల్లుచున్నారు. దానికే వారు నియమింపబడిరి" (1 పేతురు 2 : 5-8).

పునాది ఎంత బలముగా యుంటే దానిపై నిర్మించబడిన భవనముకూడ అంతే బలముగా నుండును. ప్రభువు దీని నెరుగును అందువలననే ఆయన సంఘమునకు పునాదిగాను, బండగాను ముఖ్య మూలరాయిగాను చేయబడెను. మత్తయి 7 : 24-27లో యిండ్లు కట్టుకొనిన ఇద్దరు మనుష్యులను గూర్చి అద్భుత ఒక ఉపమానము

చెప్పెను. ఒకడు బుద్ధిమంతుడు, మరొకడు బుద్ధిహీనుడు. వారు వేసిన పునాదులను బట్టి వారి ఒక్కొక్కరి యిల్లు నిలుచుటగాని లేక కూలి పోవుట గాని జరిగెను. ఆత్మీయముగా చెప్పుకొనవలెనంటే ఒకడు ప్రభువు బోధకు చూపించు మన సత్యమును బట్టి అతని పునాది ఆధార పడి యుండును. గనుక ఒకడు దేవుని చిత్తమునకు లోబడిన యెడల (మార్కు 16:16; అపొ. కా. 2:37, 38), ప్రభు వతనిని రక్షించి తన సంఘముతో చేర్చుకొనును (అపొ. కా. 2:47). దానికి క్రీస్తే పునాదియై యున్నాడు. నీవు ఎవరిమీద లేక దేనిమీద నిర్మించుచున్నావు?

---

బైబిలు గ్రంథం దేవుని వాక్యం-3

## బైబిలు గ్రంధకర్త యెవరు?

*( Who is the Author of the Bible? )*

బ్రహ్మాండమైన ఈ విశ్వము వెనుక నున్న గంభీరశక్తి దేవుడని గత సంచికలో నేర్చుకొనిన తరువాత సృష్టికంతటికిని కర్తయైనవాడు బైబిలుకు గ్రంధకర్తయో కాదో నిర్ణయించుటకు ముందుకు సాగుదము.

దైవావేశము కలిగిన మనుష్యులచే లిఖింపబడిన ట్లారోపింపబడిన 66 పుస్తకముల కలయికయైన బైబిలు మన కున్నది. అన్ని గ్రంధములకు వలె దీనికి ఒక గ్రంధకర్త యున్నాడనునది అందరు అంగీకరించినదే. అయితే ఆ గ్రంధకర్త యెవరు? మానవుడా? లేక దేవుడా?

బైబిలు మిత్రులు దేవుడే దానికి గ్రంధకర్త యని, ఆయన మనుష్యులతో పరిశుద్ధాత్మ ద్వారా మాటలాడగా వారు దానిని లిఖించిరని నమ్ముదురు. అయితే కొందరు అది దైవప్రేరితమైనది కాదని దాని లేఖకులు వారి కాలమందలి ఆచారములను వారి ఉద్దేశములను

మాత్రమే అందు వ్రాసిరని, బైబిలు చెప్పు అనేక సంగతులు కట్టు కథలని చెప్పుచు, వారు దానియందున్న అద్భుతములను కూడ నిరాకరింతురు.

## బైబిలు వాదన

అది దైవప్రేరితమైనదని బైబిలు చెప్పుకొనుచున్నది. అది దేవుని వాక్యమై యున్నదని చెప్పుకొనుచున్నది. మోషే వ్రాసిన వ్రాతలన్నిటిలో దేవుడు అవన్నియును (అతనికి) వివరించి చెప్పెనని మనకు తెలియుచున్నది (నిర్గమ 20:1) మరియు మోషే యెహోవా మాట లన్నిటిని వ్రాసెను (నిర్గమ 24:4). "అవన్నియును యెహోవా ఆజ్ఞాపించిన విధులు" (నిర్గమ 35:1).

"యెహోవా ఆత్మ నాద్వారా పలుకుచున్నాడు ఆయన వాక్కు నానోట ఉన్నదని" దావీదు చెప్పెను (2 సమూయేలు 23:2).

"యెహోవా మాటలాడుచున్నాడు. ఆకాశమా, ఆలకించుము; భూమీ, చెవియొగ్గుము" అని యెషయా చెప్పెను (యెషయా 1:2).

"యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమాయెను" (యిర్మీయా 1:4).

"యేసుక్రీస్తు తన దాసులకు కనపరచుటకు దేవుడతని కనుగ్రహించిన ప్రకటన లేక ప్రత్యక్షతను" అతడు వ్రాసెనని యోహాను చెప్పెను (ప్రకటన 1:1).

"ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21) అని పేతురు నుడివెను.

ఆఖరిగా, అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాసిన పత్రికలోని సంగతిని గమనించుదము: "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచనప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను. మనుష్యునివలన దానిని నేను పొందలేదు, నా కవ

డును దాని బోధింపనులేదు గాని యేసుక్రీస్తు బయలుపరచుటవలననే అది నాకు లభించినది" (గలతీ 1:11, 12).

బైబిలు లేఖకులు దానికి గ్రంథకర్తలమని ఇసుమంతయును చెప్పుకొనక వారి వ్రాతలన్నియును దైవావేశముచే కలిగినవని చెప్పుటలో ఏకమై యున్నారు. అది అంతయును బైబిలు కనుకూలముగా భావించబడిన సంగతులే యని అంగీకరించినను, మిగతా వాదమంతటిని పైన చెప్పబడిన ఆరోపణలమీద మాత్రము మేముంచుట లేదు. బైబిలు వ్యతిరేకులతో సహృదయత కలిగి యుండుటకు, బైబిలు గ్రంథకర్తలు మానవులు మాత్రమే యని వారు చెప్పు కొన్ని సూత్రములను పరిశీలించుటకొరకై క్రింది ప్రశ్నను వేయుదము.

## మనుష్యులు దానిని వ్రాసిరా ?

అయితే ఏ తరగతివారు ? ఆత్మీయ నైతిక సూత్రములనుబట్టి మానవలోక మంతయును సజ్జనులు దుర్జనులు, నీతిమంతులు, అనీతిమంతులని రెండు విధములుగ చేయనగును. అందుచే ఏ తరగతి మనుష్యులు దానిని వ్రాసిరి ? అని మరల ప్రశ్నింపనగును. సజ్జనులం దానిని వ్రాసిరా ? దానిని నిజముగా సజ్జనులే వ్రాసినట్లయితే వారు బైబిలుద్వారా లోకమంతటిని స్పష్టముగా మోసగించిరని నిష్పక్షపాతి యైన ప్రతి అవిశ్వాసియు తెలిసికొనగలడు. నైతికముగ అది అసాధ్యమని కూడ గ్రహించగలడు. సజ్జనులు అబద్ధమాడగలరా ? లేక అబద్ధికులు సజ్జనులు కాగలరా ?

బైబిలును వ్రాసినవారు దుర్జనులా ! అవిశ్వాసులు ఇక్కడకూడ సందిగ్ధావస్థలో పడవలసి వచ్చుచున్నది. ఏదైనా ఒక సంగతి బైబిలునందు స్పష్టముగ నిలిచియుంటే, అది పాపము యెడల దాని సమానాస్పదము కాని ద్వేషమే. పాపమును అసామాన్య పదములతో అది ఖండించుచు దానిని జరిగించువారి శిక్షను అతి ఖచ్చితముగా చెప్పుచున్నది. పాపము యెడల దాని స్వభావమును తెలిసికొనుటకు ఈ

క్రింద నీయబడిన రెండు వాక్యములు సరిపోగలవు: "యెహోవా అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు. అవే వనగా, అహంకార దృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపు చేతులును దుర్యోచనలు యోచించు హృదయమును కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును" (సామెతలు 6:16-19). "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు; ఇది రెండవ మరణము" (ప్రకటన 21:8).

ఒక ప్రశ్న :- ఈ గ్రంథమును వ్రాసినవారు ఎంత దుర్మార్గులైనను, వారు చేయు పాపములను ఖండించుచు, వాటివలన కలుగు కఠినశిక్షను గూర్చి అందు వ్రాయగలరనుట యోగ్యమా ! ఈ ప్రశ్నలోనే దాని జవాబు ఇమిడియున్నది. దుర్మార్గులు బైబిలును వ్రాసి యుండలేరనియు, సన్మార్గులు దానిని వ్రాసి సన్మార్గులవలె యుండలేరనియు మనము చూచితిమి. దైవప్రేరేపణ లేక వ్రాయబడిన అనేక సంగతులతో బైబిలును సరిపోల్చి చూచిన అందు గొప్ప భేదము కన్పించుచు, బైబిలు గ్రంథకర్తలు మానవులే యని చెప్పు సిద్ధాంతములను కూలద్రోయుచున్నది.

## అభివృద్ధి చేయలేము, పాటియైనదానిని పమకూర్చలేము

దైవావేశపు కలమునకు యోహాను స్వస్తిచెప్పి ఇంచుమించు 2 వేల సం॥లు కాబోవుచున్నది. బైబిలును అలనాటి మానవులే వ్రాసియుండిన యెడల, నేడు మానవులనుభవించుచున్న అనేక సదుపాయములనుబట్టి నేటి మానవులు మరింత మంచి బైబిలును వ్రాసి యుండవలసినదిగదా కీ॥ శే॥ విల్లియం జెన్నింగ్స్ బ్రాయన్ అనె

నతడు మే 4, 1911 లో చెప్పిన ఒక సంగతిని ఈ సందర్భములో చూచుకొందము :

"మానవ అంతస్థులనుబట్టి నిర్ణయించినయెడల బైబిలు వ్రాయ బడిన కాలముకంటే నేడు మానవులు దానిని వ్రాయుటకు ఎంతో అభివృద్ధిచెందియున్నారు. ఎవరి మాటలు, చేతలు బైబిలునందు వ్రాయబడెనో, ఆ వ్యక్తులందరు ఒకే జాతికి చెందినవారు. నేడు మన దేశములకంటే ఏమంత పెద్దదికాని ఒక దేశములో పాలస్తీనా కొండ లలో వారు నివసించిరి. వారికి అచ్చుయంత్రములులేవు. విశ్వవిద్యా లయములులేవు. చదువుకొనుటకు గొప్ప గొప్ప గ్రంథాలయాలు వారికి నాడులేవు. భూనలుమూలల నుండి వార్తల నందించుటకు టెలి గ్రాఫ్ తీగలు, వార్తాపత్రికలను వారెరుగరు. పైన నక్షత్రములలోను, క్రింద బండలలోను గల రహస్యములను బయలుపరచుట కానాడు శాస్త్రమింకను తన ప్రకృతి తలుపులను తెరవనేలేదు. నేటి అమిత విజ్ఞాన వికాసమునుబట్టి చూస్తే అతి మిక్కిలి సంకుచితమైన విజ్ఞాన గృహము నుండి వారు ఆయాసంగతులను గైకొనినను, ఈ బైబిలు వ్యక్తులు ప్రపంచసృష్టి జరిగిననాటి నుండి సమాధి అనంతరవు మానవ జాతి సంగతులవరకు అన్నిటినిగూర్చి చెప్పుచున్నారు., మానవుని జన నము నుండి మరణమువరకు గల ఒక చిత్రపటమును వారు మన కిచ్చి యున్నారు. ఆ మార్గమందున్న ప్రతి అపాయకరమైన స్థలమును గూర్చి మనకు చూపుడు బల్లల నుంచి యున్నారు. జాతీయచట్టమునకు పునాది వలె బైబిలునందలి "పది ఆజ్ఞలను," ఆత్మీయ సూత్రములకు "క్రీస్తు కొండమీద ప్రసంగమును" మనము తప్పక అంగీకరించి వాటి సహా యమును గైకొనుచున్నాము.

"నిర్దేవులును, నాస్తికులును వారికి సాధ్యమైతే మన కున్న బైబిలుకంటే శ్రేష్టమైన బైబిలు తయారుచేయగలరేమో చూద్దాం. వారి బడులలో నున్న మేధావుల నందరినీ వారి నేర్పరచు కొననిమ్ము.

వారి ప్రత్యేక సభ్యులు చూడదగిన స్థలములను చూడనిమ్ము. గ్రంథాలయములను పరిశోధింపనిమ్ము. వారిని జీవ, వృక్ష, జంతు, రసాయనిక, భౌతిక, భూగర్భశాస్త్రములు, మొదలగు వానినన్నిటిని పరిశోధింపనిమ్ము. కళలలోను, సాహిత్యములోను, చరిత్రలోను గల అభివృద్ధి నంతటిని వారిని గైకొననిమ్ము. ఆయా శాఖలలోని విజ్ఞానసార మంతటితోను ఒక గ్రంధమును తయారుచేసి దానిని బైబిలుకు బదులుగా వారిని లోకమున కీయనిమ్ము! బయలు దేవతా ప్రవక్తలవంటి విశ్వాసము వారికి గలదా? అసలు వారాలాగున ప్రయత్నించగలరా? లేని యెడల వారేమని సాకు చెప్పగలరు? మానవుడు 2 వేల సంవత్సరముల క్రిత మత డున్నట్టి స్థాయినుండి క్రిందికి పడిపోయెనా? లేక మానవునికంటె ఉన్నతమైన స్థావరము నుండి బైబిలు మనకు లభించెనా? – ఇందులో ఏమి?"

## అవావేశ చరిత్రతో బైబిలు

అనావేశ చరిత్రకారులు గొప్ప వ్యక్తుల చరిత్రను వ్రాయునపుడు ఆ వ్యక్తుల సుగుణాలనే ఎత్తి చూపించుచు, దుర్గుణాలపై నిశ్శబ్దముగ యుందురు. బైబిలు పాపమును ద్వేషించుటచే అందలివ్యక్తుల సదలవాట్లనే కాక వారి లోపములనుకూడ బయలుపరచు చున్నది. గొప్ప నీతి సూత్రములను బోధించినవాడని అది నోవహును గూర్చి ఒకవైపున చెప్పినను, రెండవవైపున అతడు ఓడలో నుండి వెలుపలికి వచ్చిన తరువాత మద్యపానముచే మత్తుడైనట్లు కూడ తెలియజెప్పు చున్నది. అబ్రాహాము దేవుని మిత్రుడని, విశ్వాసులకు తండ్రి యని మంచిపేరును బడసినవాడే అయినను అతడొక మారు మోసగానివలె ప్రవర్తించినట్లు బైబిలు చెప్పుచున్నది. మోషే గొప్ప శక్తివంతుడైన మానవుడని, రాబోవు క్రీస్తుమాదిరి నున్నవాడని మన కందరకు తెలిసినదే. అయితే పాపము చేయుటచే అతడు వాగ్దానము చేయబడిన దేశములో ప్రవేశించలేక పోయెనని బైబిలు నుడువుచున్నది.

దేవుని హృదయ సంబంధుడని దావీదు మంచి పేరును సంపాదించు కొనెను. అట్టివాడు మానవచరిత్ర యంతటిలోను ఘోరమైన నేర మును గావించినట్లు మానవ గ్రంధకర్త యెవడును వ్రాసి యుండ లేదు. అయితే బైబిలు దానిని తప్పక చెప్పుచున్నది. మానవ లిఖిత చరిత్రకును, బైబిలునకును మధ్యగల ఈ భేదమును చూచిన తరువాత బైబిలు గ్రంధకర్త మానవుడు కానేరడని మనము అనుమతించక తప్పదు.

## దాని ఏకత్వము

వివిధ కాలములలో నివసించిన ఆయా జాతులలోని, తరగతుల లోని 40 మందిని వారి స్వదుద్దేశముల నుపయోగించి ఒక అంశముపై ఒక గ్రంథమును తయారు చేయుడని మనము అడిగిన యెడల వారు వ్రాసిన గ్రంథమంతయు విభిన్న సంగతులతోను, స్వవిరుద్ధ సమా చారముతోను నిండియుండ గలదనుటలో సందేహము లేదు.

రకరకాల వృత్తులను కలిగి, వివిధ కాలములలో నివసించిన 40 మంది మనుష్యులచే 1600 సం॥లలో లిఖింపబడిన 66 పుస్తకముల సంపుటియే బైబిలు. వారిలో కొందరు గొల్లలు, మరికొందరు పల్లె వారు, ఒకడు వైద్యుడు, మరియొకడు తృణీకరింపబడిన సుంకరి. వారు వివిధ కోణముల నుండి అనేక అంశములను గూర్చి వ్రాసిరి. అయినను వారి యందరి కృషిని ఒక సంపుటిగా చేసి చూస్తే వారందరు ఒకే ముఖ్యాంశమును, అనగా మానవుని రక్షణగూర్చి ఒకరి నొకరు విరుద్ధముగా గాక ఏకమైనట్లు వ్రాసిరి. 40 మంది వ్రాసిన వ్రాతలలో గల ఈ గొప్ప ఐక్యతను గూర్చి మనమేమని చెప్పుకొందుము? దైవా వేశము లేని సామాన్య మానవులే దానికి కర్తలని మనము చెప్పు దుమా? లేక బైబిలు లేఖకులు గ్రంధకర్తలకు కర్తయైన వానిచే నడి పించ బడిరని చెప్పుట మరింత సమంజసము కాదా!

# ప్రకృతి - బైబిలు

దేవుడున్నాడని నమ్మువారందరు, ఆయనే ప్రకృతికికూడ కర్త యని అంగీకరింతురు. దేవుని ప్రకృతి గ్రంథమునకు, బైబిలునకు అత్యంత సన్నిహిత సంబంధము గలదు. ఈ రెండును ఒకే వ్యక్తివలన కలిగెననుటలో సందేహము లేనంతటి సన్నిహితత్వము గలదు.

ప్రకృతి, బైబిలు ఈ రెండును సూక్ష్మ సంగతులలోను, గంభీర సంగతులలోను ఒకే విధముగ నున్నవి. ప్రకృతికూడ ఒక వైపున మనకు అతిసూక్ష్మముగ నగుపడును. వ్యవసాయకుడు పొలమును ఎప్పుడు దున్ని, విత్తనములు జల్లవలెనో ఎరుగును. విత్తనములు మొలకెత్తగా పంట పెరుగుట కతడు భూమి నెట్లు బలపరచవలెనో ఎరుగును. కోతకాలము రాగానే కోత నెట్లు కోయవలెనో అతడెరుగును. అయినను గొప్ప గొప్ప మేధావులుకూడ వివరించలేని గంభీరసంగతులు ప్రకృతియందు దిమిడియున్నవి. విత్తనములో ఇమిడి యున్న "జీవము" అను శక్తి యేమి? విత్తనము భూమిలో నాటబడిన తరువాత అది భూమి వెలుపలికెట్లు మొల కెత్తును? అది ఒక మొక్కవలె పెరిగి తన జాతిప్రకారమే ఎట్లు ఫలముల నిచ్చును? వీటన్నిటికి గొప్ప శాస్త్రవేత్తలు కూడ జవాబీయలేరనుట సత్యము.

మన మందరము సాధారణముగా ఉపయోగించునది - ఆహారము. మనము జీవించు ప్రతిదినము దానిని భుజించెదము. అది చాల సూక్ష్మమైన పనియే. చిన్నపిల్లవాడు కూడ ఇట్టే అన్నము తినుట ఎరుగును. మన ప్రాణము మనము భుజించు ఆహారముపై ఆధారపడి యున్నది. జీర్ణక్రియను మన మెరుగము. మనము తినుచున్న ఆహారము ఎట్లు జీర్ణమగుచున్నదో ఎట్లు రక్తముగాను, శక్తిగాను మారుచున్నదో మనలో ఎవరికిని తెలియదు.

బైబిలు నందుకూడ అట్లే, చిన్నపిల్లవాడు సహితము అర్థము చేసికొనగల్గునట్టి సత్యము లున్నవి. దేవుని యెడల మన బాధ్యతను

గూర్చిన విషయములు మనము తప్పుచేయుటకు వీలులేనంత విపులముగా అందు వ్రాయబడెను. అయితే గొప్ప మేధావులుకూడ విప్పి చెప్పలేని పరమ సత్యములందున్నవి. ప్రపంచమం దనేక మేధావులు బైబిలును పఠించుటలో తమ జీవితకాలమంతయు వెచ్చించినను దాని పైపై పొరలనే తెలిసికొన గల్గితిమని చెప్పిరి.

స్వవిరుద్ధ సంగతులవలె కన్పడు సందర్భములలో బైబిలు ప్రకృతి ఒకేవిధముగ నున్నవి. ఒక చిన్న రాయిని నీటి పై భాగమునను, ఒక బెండును నీటి అడుగుభాగమునను వదలిన యెడల రాయి క్రింద కును, బెండు పైకిని వచ్చును.

ప్రకృతి సూత్రముల కిది విరుద్ధమువలె మనకు కన్పించును. అయితే భూమ్యాకర్షణ సూత్రములను మన మెరిగిన యెడల ఆ స్వవి రుద్ధ సంగతివలె కన్పడునది మాయమగును.

సందేహశీలునికి లేక పైపైనే చదువువానికి బైబిలునందు కూడ అట్లే కొన్ని స్వవిరుద్ధములవలె కన్పడు సంగతులు తటస్థించును. అయితే ఈయబడిన వాస్తవముల నన్నిటిని జాగ్రత్తగా అతడు చది విన, అవి మాయమైపోవును. ఉదా:_గలతీ 6:2 లో పౌలు గలతీయుల కిట్లు చెప్పెను :

"ఒకని భారము నొకడు భరించి ఈలాగున క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి". అయితే 5వ, వచనములో "ప్రతివాడును తన బరువును తానే భరించుకొనవలెను గదా?" యని అతడు మరల చెప్పెను. ఇక్కడ ఒకదాని కొకటి విరుద్ధముగా నున్నట్లగుపడుచున్నది. జాగరూక పఠనమువలన ఇక్కడ పౌలు రెండు రకములైన భారము లను గూర్చి చెప్పుచున్నట్లు మనము గమనించెదము. ఒకరినొకరు భరించుకొను ధన, విచార, సంతోషభారములు కలవు. అయితే ఒకడు దేవుని యెడల తనకుగల బాధ్యత భారము కూడ కలదు. దానిని మరి

యొకడు భరించలేడు. ప్రకృతిలోవలెనే, బైబిలునందు కూడ వాస్త వముల నన్నిటి నెరుగుటవలన స్వవిరుద్ధ సంగతులవలె కన్పడునవి ఇష్టసూయ మగును.

మానవుని నిత్యావసరములకు ప్రకృతి, బైబిలు ఈ రెండును ఒకే విధముగ ఉపయోగ పడుచున్నవి. ప్రకృతిలో మనము పీల్చుకొనుగాలి, త్రాగునీరు, భుజించు ఆహారము ఒక ప్రత్యేక జాతికి ఏర్పడినవి కావు. అన్ని యుగములలో నివసించిన మానవులందరికి అవి అవుసరమై యున్నవి. వృద్ధులు, యౌవనులు, ధనికులు, ధనహీనులు, స్వతంత్రులు, బానిసలు, ప్రతివారును తమ తమ భౌతిక అవుసరతలను ప్రకృతివలన తీర్చుకొందురు.

బైబిలును మనము గమనించిన, అదియు నట్లే మానవులందరికి ఉపకారివలె నున్నది. జాతి, కుల, కాల వివక్షత లేక అందరి హృదయములను ఒడిసిపట్టుకొనగల్గిన సమాచార మిందిమిడియున్నది. మానవులు ఏయే దేశములలోనున్నను, వారు "మన బైబిలు" అని ఈ గ్రంథమును గూర్చి చెప్పుకొందురు.

బైబిలు గ్రంథకర్త యెవరు? పైన చూపిన ఋజువులను బట్టి అతడు మానవుడు కాదు అని తేటబడినది. మానవుడు వ్రాయగల్గినను దానిని అతడు వ్రాసి యుండలేదు. నాస్తిక ప్రపంచమును తల్లడిల్లజేయుచు, యుగ యుగములలోను నిలిచిన ఒకే ఒక్క సరియైన జవాబు దీనికికలదు. అది "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని, మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" అనునది (2 పేతురు 1:21).

—మోరిస్ W. R. బెయిలీ

# కాలము
## *(Time)*

5 బిలియన్ల (5 లక్షల కోట్ల) సంవత్సరముల క్రిందట భూమి ఏర్పడెనని పరిణామ సిద్ధాంతీకులు చెప్పిరి.

పరిణామ సిద్ధాంతములో కాలమునకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడెను. యిందు కాలము ముఖ్య పాత్ర వహించెనని వారి అభిప్రాయము. ఈ అనంత కాలగమనముతో ఏ శక్తి ప్రమేయము లేకుండ కాలము అసాధ్యమైన విషయములను జరిగించెనను నదియే పరిణామ సిద్ధాంత సారాంశము. మనము వేచి చూచినయెడల కాలము దానికదే అద్భుత కార్యములను జరిగించునా ! కాలమునకు సృజించు శక్తిగాని, అభివృద్ధిచేయు శక్తిగాని లేదు. కాని పరిణామ సిద్ధాంతీకులు కాలమే సృష్టినంతటిని అభివృద్ధి పరచెనని నమ్ముచున్నారు.

5 లక్షల కోట్ల (బిలియన్ల) సంవత్సరముల క్రిందట భూమి ఏర్పడెనని పరిణామ సిద్ధాంతీకుల అభిప్రాయము. జీవపదార్థ ముద్భవించి సుమారు 2 లక్షల కోట్ల (బిలియన్ల) సంవత్సరములైనదని చెప్పుచున్నారు. ఈ సిద్ధాంత ప్రకారము భూమి ప్రారంభమునకు మానవుని ప్రారంభమునకు మధ్య కొన్ని బిలియన్ల సంవత్సరములున్నవి. ఈ చరిత్ర అంతయు 19వ శతాబ్దములో వ్రాసినదే. 19వ శతాబ్దమునకు ముందు పరిణామ సిద్ధాంతము లేదు. వారు ఈ కాలమంతటిని 4 యుగములుగ విభజించిరి. జీవపదార్థమున్న స్థితిని బట్టి ఒక్కొక్క యుగమును కొన్ని భాగములుగ విభజించిరి.

జీవరాసుల పరిణామ క్రమమును సంపూర్ణముగ వ్రాయుటలో డార్విన్ విఫలుడయ్యెను. జీవరాసుల పరిణామ దశలన్నిటిని గూర్చి డార్విన్ చెప్పలేకపోయెను. ఉదాహరణకు వృక్షములకు మానవులకు మధ్యనున్న అగాధమును కలుపుటకు 'లింకు'లు గాని నమూనాలుగాని సేకరించలేకపోయెను. ఒక కపాలమును ఎముకను చూపి యిదే కోతిక

మానవు ని ధ్యనున్న 'లింకు' అని చూపించుచున్నారు. డార్విన్ యొక్క 'ఫాసిల్ రికార్డు' (Fossil Record) అసంపూర్ణమైనదే.

పరిణామము చెందిన మానవునికి కాలమే భాష నేర్పెనా! శిశువు పాలిచ్చి పెంచుటకు తల్లికి ప్రత్యేక అవయవ నిర్మాణము ఏర్పాటు చేసినది కాలమా? ఆ పాలలో పసికందుకు కావలసిన పోషక పదార్థములన్నియు ఉంచిన దెవరు? తల్లికి బిడ్డపైనున్న ఆ ప్రేమానురాగాలను కాలమే యిచ్చినదని డార్విన్ చెప్పినపుడు మీ అభిప్రాయ మేమి?

మానవునికి అవసరమైన వన్నియు కాలమే అనుగ్రహించెనను సిద్ధాంతముకంటె హాస్యము మరొకటి లేదు.

అందరు గమనించవలసిన గొప్పవిషయ మేమనగా "కాలములను సమయములను తండ్రి (దేవుడు) తన స్వాధీనమందుంచుకొని యున్నాడు" అ॥కా 1:7.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## "శరీర మొక్కటే ఆత్మయు ఒక్కడే"

### ఎఫెసీ 4 : 4

శరీరము అనగా సంఘము ఒక్కటే (ఎఫెసీ 1:22). ఈ సంఘమునకు అవసరమైన బోధ ఒక్కసారే అప్పగింపబడెను (యూదా 3) ఏబోధ అప్పగింపబడెను? క్రీస్తుబోధ (2 యోహాను 9). సంఘము క్రీస్తు బోధను విడిచి ముందుకు పోకూడదు. క్రీస్తు బోధ ఎవరు నేర్పిరి? ఆత్మ నేర్పెను (1 కొరి 2:13). ఆత్మవలన ఎవరు నేర్చుకొనిరి? అపొస్తలులు (యోహా 14:26). ఆత్మ ఎక్కడనుండి ఆ బోధను పొందెను? క్రీస్తులోనుండి క్రీస్తువలన (యోహా 16:13-15). ఆత్మ అపొస్తలులకు ఎంతవరకు సత్యమును బోధించెను? సమస్తము, సర్వ సత్యము

బోధించెను (యోహా 14:26; 16:13). ఎప్పుడు పరిశుద్ధాత్మ శిష్యులను సర్వసత్యములోనికి నడిపించెను? క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానుడై నలువది దినముల వరకు వారికి అగుపడుచూ పరమునకు ఆరోహణుడై వాగ్దానము చేయబడిన ఆత్మను కుమ్మరించిన పిమ్మట (అపొ. కా. 2:1-4). ఆత్మ వారిలో ఎట్లు, ఎట్టి క్రియలను చేసెను?

ఆత్మ వారికి వాక్‌శక్తి నిచ్చిన కొలది వారు ఇతరుల భాషలలో దేవుని గొప్పకార్యములు వివరించగలిగిరి (అపొ. కా. 2:4, 11). దేవుని ఘనపరచిరి (అపొ. కా. 10:45-46).

ఆత్మ వరములను అనుగ్రహించెను. బుద్ధివాక్యము, జ్ఞానవాక్యము, విశ్వాసము, స్వస్థతపరచు వరము, అద్భుత కార్యములుచేయు శక్తి, ప్రవచనవరము, ఆత్మల వివేచన, నానావిధ భాషలు మాటాడే వరము, భాషల అర్థము చెప్పు శక్తియు. వారందరు ఒక్క అడుగుజాడలయందు ఒక్క ఆత్మవలననే నడిచిరి (2 కొరి 12:18). వారు దర్శనములద్వారా, ప్రత్యక్షతలద్వారాను నడచిరి. ఆత్మ ఒక్కడే గనుక వారంతా ఒక్క ఆత్మనే పొందిరి గనుక ఒక్క సిద్ధాంతం, ఒక్క బోధ, ఒక్క మాటను వారు కలిగియుండిరి (అ.కా. 16:6-10, 2 కొరి 12:7).

ఆత్మ ప్రత్యక్షత అప్పటి వారికి కలిగినట్లే ఇప్పటి మనకును జరుగునా? (1 కొరి 12:7). "వారు బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియలవలన వాక్యము స్థిరపరచుచుండెను" (మార్కు 16 : 20).

"...ప్రభువు వారిచేత సూచక క్రియలను, అద్భుతములను చేయించి తన కృపావాక్యమునకు సాక్ష్యమిప్పించుచుండెను" (అ.కా. 14:3). "రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై దేవుడు తన చిత్తానుసారముగా సూచకక్రియలచేతను, మహత్ కార్యములచేతను,

నానావిధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను, వారితో కూడా సాక్ష్య మిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:3, 4). "వారితో" అనగా అపొస్తలులతోను వారివలన వరములు పొందినవారితోను సాక్ష్యముగా ఆ క్రియలు జరుగుచుండెను (అ.కా. 6:6, 2 తిమొ 1:6). "వినినవారిచేత" వారే క్రొత్త నిబంధన వ్రాసినవారు వారిచేత మనకు దృఢపరచబడెను. ఈ రీతిగా వాక్యము స్థిరపరచబడెను (హెబ్రీ 2:2). రక్షణ మనకొరకు స్థిరపరచబడెను.

పూర్ణమైనది అనగా క్రొత్త నిబంధన వాక్యము పూర్ణముగా వచ్చువరకు అట్టి కార్యాలు వారివలన వారి మధ్యలో జరుగుచుండెను (1 కొరింథీ 13:8-13). వాక్యము పూర్ణముగా స్థిరపడిన తరువాత అనగా క్రొత్త నిబంధన గ్రంథముగా వ్రాయబడిన పిమ్మట పరిశుద్ధాత్మ వరములు ఆగిపోయెను. ఇప్పుడు మనయందున్నవి ఆత్మ ఫలములు మాత్రమే (గలతీ 5:22).

అయితే కొన్ని శాఖలవారు పరిశుద్ధాత్మ క్రియలు అని చెప్పుకొనుచూ చేస్తున్నవి అనగా భాషలు అంటూ ఏవో శబ్దాలు చేస్తు గోల పెట్టుట, క్రిందపడి దొర్లుట, శరీరమును కదుపుట, ఊగుట మొదలైనవి ఆత్మకార్యాలు కావు (1 తిమొ 4:1-2). మరియు ప్రవచనములని వారు చెప్పేవి పచ్చి బూటకములే (ద్వి. కాం. 18:21-22, లూకా 21:8, 2 పేతు 2:1).

స్వస్థత వరముగలవారని చెప్పేవారి ప్రార్థనలవలన క్యాన్సర్, పోలియో, కుష్టు, గుడ్డి, (బోద) ఫైలేరియా, షుగరు మొదలైన వ్యాధులు బాగుపడుట లేదు. కారణం ఆత్మ వరములు ఆగిపోయెను గనుకనే స్వస్థత వరము గలవారమని చెప్పుకొనేవారు, ఆసుపత్రులు, కుష్టురోగుల ఆసుపత్రులు స్థాపించుచున్నారు.

దేవుడు నాతో దర్శనములో మాట్లాడుచున్నాడు! ప్రభువు నన్ను పేరుపెట్టి పిలచి నా సేవ చేయమని చెప్పాడు అంటున్నవారంతా తాము మోసపోయి ఇతరులను మోసగించుచున్నారు. వారికి క్రొత్త నిబంధనయందున్న క్రీస్తు వాక్యం తెలియదు. వీరు క్రీస్తు సువార్త చెరుపువారు.

అపొస్తలులకు బైలుపర్చిన వాక్యాన్ని వారు గ్రంథంగా వ్రాశారు. అదే అపొస్తలులద్వారా లోకమును దేవునితో సమాధానపర్చు పిలుపు (2 కొరింథి 5:19-20, 2 థెస్స 2:14-15). వ్రాయబడిన వాక్యము మాత్రము ఒకనిని సంపూర్ణ భక్తిగల వానిగా చేయగలదు (2 తిమొ 3:16-17).

మనుష్యులు ప్రకటించే సువార్తను నమ్మువానిని రక్షించుట దేవుని దయగల సంకల్పము (1 కొరిం 1:21, అ. కా. 11:14, గల 1:8-9).

అపొస్తలులు దేవదర్శనమువలన పొందిన మర్మమును మనము గ్రహించుకొనుటకు వారు వ్రాసియుండిరి (ఎఫె 3:3). అది చదివి తెలిసికొనవలెను.

మనము చదివి గ్రహించగలిగిన సంగతులను మాత్రమే వారు వ్రాసిరి (2 కొరిం 1:13).

అపొస్తలులు శరీరములో ఉన్నంతకాలము వారు బోధించుచు మాటిమాటికి జ్ఞాపకముచేసి రేపుచుండిరి. వారు మృతిపొందిన తరువాత కూడ సంఘము దేవుని వర్తమానమును నిత్యము జ్ఞాపకము చేసికొనులాగున భద్రపరచిరి (2 పేతు 1:12-15). అవియే వ్రాయబడిన వాక్యములు (2 పేతు 1:20-21). మనము దేవుని చిత్తమును తెలిసికొనుటకు లేఖనములను చదువుటయందు జాగ్రత్తగా ఉండవలెనని వ్రాయబడెను (1 తిమొ 4:13).

ప్రభువు తన ఆత్మద్వారా బయలుపరచిన సంఘము మాది అని చెప్పుకొనే నాయకులను వారి బోధలోగాని నడిపింపులోగాని ఒక్క ఆత్మయందు వారున్నట్లు కనుగొనలేము.

వారు ఒకరితో ఒకరు పొసగని సంఘాలను, సిద్ధాంతాలను కల్పించుకొని ఇదంతా ప్రభువు నడిపింపు, ఆత్మ ప్రత్యక్షత అని చెప్పుకొనుచున్నారు.

నిజమునకు వీరి బోధలు క్రొత్త నిబంధనతో ఏమాత్రము పోలిక లేకపోయినను దేవుడు నాతో మాటలాడెనని చెప్పుచూ లోకమును మోసగించుచున్నారు. అనేకులు వీరి అబద్ధ సిద్ధాంతమును నమ్మి తమ ధన, మాన, ప్రాణములను త్యాగము చేయుచు నిష్ఫలులగుచున్నారు.

ఎవరును మోసపోక యుండునట్లు తెరవబడిన బైబిలు నొద్ద కూడుకొనుట మేలు.

శరీరము=సంఘము ఒక్కటే. అదే క్రీస్తు సంఘము. అనేక స్థానిక సంఘములుగా లోకమందు విస్తరించుచున్నది (రోమా 16:16). ఆత్మయూ ఒక్కడే. ఆయననుండి లేఖనములు ఒకే సిద్ధాంతముగా వ్రాయబడినవి (2 పేతు 1:20-21). మీరు ఏ శరీరములో ఎవరి నడిపింపులో ఉన్నారు?

—పాల్ గూటం, గొల్లవిల్లి.

---

## ఒకే సంఘము
## (*One Church*)

పాత నిబంధన కాలములో దేవుని ప్రజలు సంఘమని ఒకే ఒక్క సారి పిలువబడ్డారు. అరణ్యములోని సంఘముతో మోషే యుండెనని స్తెఫను చెప్పాడు (అపొ. కా. 7:38). అప్పటి ఆ సంఘమందు యూదులు మాత్రమే యుండిరి (నిర్గమ 34 : 27-28).

కాలారంభమునుండి మానవులందరు యుండగల్గునట్టియు, యుగయుగములు నిలుచునట్టియు సంఘమును గూర్చి దేవుడు సంకల్పించాడు. "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును, అధికారులకును సంఘముద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని" ఉద్దేశించాడు (ఎఫెసీ 3:10, 11). అరణ్యములో యున్న సంఘము ఆయన సంఘము కాదు. ఏలయనగా ప్రవక్తయైన యెషయా ఇట్లు చెప్పుచున్నాడు: "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు" (యెషయా 2:2). అంత్యదినములలో తానొక సంఘమును స్థాపింతునని దేవుడు చెప్పాడు. సమస్త జనులు దానిలోనికి ప్రవాహము వచ్చినట్లు వచ్చెదరు. అరణ్యములో సంఘముతో మోషే యున్న చాలకాలము తరువాత ఈ మాట చెప్పబడినది. దేవుడు స్థాపింపబోవు సంఘము ఆయన నిత్యసంకల్పము. సమస్త జనులు దానిలోనికి వచ్చెదరు. యెహోవా మందిరమనే చెప్పబడింది, సంఘమని చెప్పబడలేదని నీవనుకొనుచున్న యెడల, 1 తిమోతి 3:15లో చూస్తే దేవుని మందిరమే జీవముగల దేవుని సంఘమని చెప్పబడినది. ఈ సంఘము తరతరములు, సదాకాలము నిలుచును (ఎఫెసీ 3 : 21), శరీరమొక్కటే (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము (ఎఫె 1:22, 23).

యెషయా ప్రవచించిన సంఘము ఒక్కటే. సమస్త జనాంగములు దానిలో ప్రవేశింతురు. ఈ సత్యాన్ని మనం నమ్మడమే గాక, అనుసరించునంతవరకు వక్కాణించాలి. ఏదో ఒక ప్రత్యేకమైన విధముగా సంఘము ఆంగ్లజాతీయులకు చెందను. ఈ గొప్ప సత్యాన్ని మనము, మిగతా జాతులవారు గ్రహిస్తే ఒక గొప్ప మార్పు కనబడతాది. క్రొత్త నిబంధనలో యేమి జరిగిందో మనం నేర్చుకోవాలి.

యేసు యిచ్చిన గొప్ప ఆజ్ఞలో సువార్త సర్వసృష్టికి ప్రకటింపబడవలెనని, సమస్త జనాంగములను శిష్యులనుగా చేయవలెనని, సమస్త జనాంగములకు మారుమనస్సు పాపక్షమాపణ ప్రకటింపబడవలెనని ఆజ్ఞాపింపబడినను, సువార్త మొదట యూదులకే ప్రకటింపబడింది (మార్కు 16:15, అపొ. కా. 3:19; లూకా 24:47). అటు తరువాత సమరయులకు ప్రకటింపబడింది. అది అన్యజనులకు ప్రకటింపబడే లాగున మరల దేవుడే జోక్యం చేసుకోవలసివచ్చింది. అన్యజనులకు సువార్త ప్రకటించుటకు పేతురును ప్రోద్బలము చేయడానికి మూడు అద్భుతములు అవసరమైనాయి.

## క్రొత్త క్రమం

1500 సంవత్సరములకంటే పైగా యూదులు దేవునిచే నిబంధన చేయబడిన ప్రజలని మనం జ్ఞాపకముంచుకోవాలి. అన్యజనులమైన మనము దేవుడులేకను నిరీక్షణలేకను యున్నామని పౌలు చెప్పాడు (ఎఫెసీ 2:11, 12). అయితే ఒక క్రొత్త క్రమం ఉద్భవించింది. పరిశుద్ధాత్మని సహాయమువలన పేతురు, "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించునని" చెప్పాడు (అపొ. కా. 10:34, 35). ఇక శరీర రీతిగా యెవని ఎరుగము అని కూడ చెప్పబడింది (2 కొరింథీ 5:15). ఈ గొప్ప మార్పులు ప్రతిఘటన లేకుండా అంగీకరింపబడిపోలేదు. అన్యజనులు సున్నతి పొంది మోషే ధర్మశాస్త్రము నవలంబించితేనేగాని రక్షింపబడరు అని చెప్పేవారు సంఘములో యుండిరి (అపొ. కా. 15:5). అయితే విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడని పరిశుద్ధాత్ముని శక్తివలన పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:4). ధర్మశాస్త్రమువలన నీతిమంతులని తీర్చబడువారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు (గలతీ 5:4). ఇట్టి బోధతో క్రొత్త నిబంధన నిండియున్నది.

# క్రొత్త చట్టము

పాత నిబంధన చట్టము సీనాయినుండి వచ్చెను. క్రొత్త నిబంధన చట్టము యెరూషలేము నుండి కలిగెను (మెష 2:3). ఆ క్రొత్త చట్టము యెరూషలేములో పెంతెకొస్తునాడు ప్రకటించ బడెను (అపొ. కా. 2). క్రీస్తు యొక్క సర్వాధికారము ప్రకటింపబడెను (అపొ. కా. 2 : 36). మానవులు క్రీస్తు అధికారము సంగీకరించి మేమేమి చేయాలి అని అడిగారు. వారి కీయబడిన జవాబు సూక్ష్మంగా యిది : మీలో ప్రతివాడు పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి (అపొ. కా. 2:38). ఆ వాక్యము నంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. యెరూషలేము నుండి బయలువెళ్ళిన ధర్మశాస్త్రము యిదే (అపొ. కా. 2:41). ఆదిమసంఘము అపొస్తలుల బోధయందు నిలకడగా యుండెను (అపొ. కా. 2:42). దానిలో మార్పేమియు సంభవించరాదు. ఏల యనగా ఆకాశము భూమి గతించునుగాని నామాటలు గతింపవని యేసు చెప్పాడు.

సంఘము అపొస్తలుల బోధయందు నిలిచి యుండాలని యేసు కోరాడు. తన సంఘము అట్లు నడిపింపబడాలని ఆయన కోరాడు. సిలువ నీడలో యుంటూ యేసు చేసిన ప్రార్థన యిది : "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21). ఎల్ల కాలము తన సంఘము అపొస్తలుల బోధ చొప్పున నడిపింప బడాలని ప్రభువు యొక్క కోరికయై యున్నది. అమెరికా చట్టములు వాషింగ్టన్ పట్టణం నుండి, ఇండియా చట్టములు క్రొత్తఢిల్లీ నుండి వస్తాయి. గాని దేవుని చట్టం యెరూషలేము నుండి ఈయబడింది. ఆకాశము భూమి గతించినా తన మాట గతింపదని యేసు చెప్పాడు.

## అపొస్తలుల బోధ పరిష్కార మార్గము

పెంతెకొస్తునాడు యెరూషలేములో ఆరంభమైన బోధను బట్టి ఆత్మీయ విషయాల్లో ఏ వివాదాన్నైనా పరిష్కరించ వచ్చు. మనం రెండు ఉదాహరణల నీయవచ్చు: క్రీస్తు సంఘముల ఆరాధనలో వాయిద్యముల నెందుకు వినియోగించరు? అది అపొస్తలులబోధలో లేదు. వివిధ సంఘాలు వివిధ కాలాల్లో వాద్యముల నుపయోగించుట మొదలు పెట్టారు. ఇది వారి యభీష్టం. అయితే క్రీస్తు తన సంఘానికి శిరస్సై యున్నాడు. గనుక ఆ చట్టాన్ని ఆయనే మార్చగలడు. అయితే ఆయన వాక్యం మారదని ఆయన చెప్పాడు. శిశు బాప్తిస్మము యెరూషలేము నుండి గాక, రోమా నుండి వచ్చినది. ప్రతి ప్రశ్నను ఈవిధంగా మనం పరిష్కరించ వచ్చు.

దేవునియొక్క పితృత్వము, మానవుని సౌభ్రాతృత్వము క్రొత్త నిబంధన బోధయై యున్నది. అన్ని జనాంగములవారు సంఘములోనికి ఒకే విధంగా ప్రవేశిస్తారు. వారు ఒకే ప్రభుత్వంక్రింద యున్నారు. వారికి ఒకే బాధ్యతలున్నవి, ఒకే దీవెనలను పొందుతారు. ప్రపంచ సువార్త క్రీస్తుతో ఆరంభమైనది (మత్తయి 28:18). దాన్ని అపొస్తలులు ఆచరించారు. "పునాదిమీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశముక్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్తవలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక విశ్వాసమందు నిలిచియుండిన యెడల ఇది మీకు కలుగును. పౌలను నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని" (కొల 1:23).

మానవులు మారుదురుగాని క్రీస్తు బోధ మాత్రం మారదని జ్ఞాపక ముంచుకొనుము. క్రొత్తనిబంధన క్రైస్తవ్య పునరుద్ధరణకు మనం నిజంగా ప్రతిష్టించుకొన్నామా? బైబిలు వెళ్ళిన చోట విగ్రహారాధన అంతమైపోతాది. క్రొత్తనిబంధన ప్రకటింపబడిన చోట మతశాఖలు అంతమైపోవాలి (ఎఫెసీ 1:22, 23; 5:23-27).

★

—జె. సి. బెయిలీ.

# నిజమైన సంతోషము

ఈ లోక సంగతులు మనం ఆశించు నిత్య సంతోషాన్ని ఈయజాలవని సొలొమోను ప్రసంగి గ్రంథంలో తెలియజేయుచున్నాడు. దేవుని జ్ఞానానికి బదులు మానవ జ్ఞానాన్ని ఉపయోగించు వాడు ఎంత జ్ఞానియైనా త్రోవ తొలగిపోగలడని యిది మనకు తెలియజేయుచున్నది. సంతోషాన్ని వెదకుటలో, ఈ లోకములోని సంగతులన్నీ వ్యర్థము, నిష్ప్రయోజనం. నిజానికి ప్రసంగి గ్రంథం యొక్క సారాంశమే యిది: సూర్యుని క్రింద నరులు పడు పాట్లన్నియు వ్యర్థము (ప్రసంగి 1:2-3). మన దృష్టి ఆత్మీయ సంగతులపై యున్నప్పుడు నిజమైన సంతోషము కలుగును.

మొదటిగా, ఈ లోకజ్ఞానములో సంతోషము దొరుకదు (ప్రసంగి **1 : 16**-18). సొలొమోను మానవు లందరికంటె జ్ఞాని (1 రాజులు 3:9-12). దేవుడు లేని లోకజ్ఞానం వట్టిది, నాశనకరమైనది (1 కొరింథీ **1:20-21**). చివరకు జ్ఞానులుకూడా చనిపోతారు. బుద్ధిహీనులను గూర్చికూడా మనం అట్లే చెప్పుకొందుముగదా (ప్రసంగి 2:12-17; హెబ్రీ 9:27).

రెండవదిగా, ఐశ్వర్యంలో సంతోషం లేదు. సొలొమోను చాల ధనవంతుడు. అయినను ఐశ్వర్యం సంతృప్తి పరచదని, దాని కొరకు పడే పాట్లన్ని వ్యర్థమని అతడు గ్రహించాడు (ప్రసంగి 4:7-8; 2:18-20; 5:10-10; 6:1, 2; 1 తిమో 6:10).

మూడవదిగా, ఈ లోక భోగములు తృప్తిపరచవు (ప్రసంగి 2:1-11). అనేకులు 'తినుము త్రాగుము సంతోషించుము' అనే రీతిగా తమ జీవితాలను గడుపుచున్నారు. అయితే దాని పర్యవసానమును వారెరుగరు, దాన్ని గూర్చి విచారించరు (లూకా 12:19-21).

చివరిగా, యదార్థమైన సంతోషం దేవునికి విధేయు లగుటలో యున్నదని సొలొమోను గ్రహించాడు (ప్రసంగి 12:13, 14). ఈ జీవితంలో యున్న ఇద్దరు యజమానులు ఇచ్చే బహుమానాన్ని మనం గమనిస్తే సొలొమోనుతో మనం తప్పక ఏకీభవిస్తాము (రోమా 6:16-18, 23).

—జాన్ వాడీ.

# మేల్కొలుపు

సీ॥ కూలివాలియు లేక - కుడువ కూడును లేక
మలమలా పస్తులు - మాడువారు
ఇల్లువాకిలి లేక - పైన పాతయు లేక
పండ చాపయు లేక - వడవడా చలిలోన వణుకువారు
కాళ్ళుకన్నులు లేక - కదలమెదల లేక
దేవుని తెలియలేక - వాపోవువారు
కలరు సర్వసృష్టిలో - నేడు కోట్లకొలది కనులార
గాంచి, ఊరకుందురే - నిజ క్రీస్తుసంఘ సోదరులారా!
తే॥గీ॥ ఇదిమీకు - న్యాయంబుగాదు
తెలసిపొందుడి - సువార్తవైపు
ఎల్లజగములకు - ఇది నిక్కమనుచు
తెలియజేయుడి - ఈ సత్యవాక్కు.

—D. రామకృష్ణంరాజు, బట్టి కంద్రిగ.

---

Regd. No. H/KD-45/KD.H.O

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To
..............................
..............................
..............................
..............................